అంధ విద్యార్థులకు అండగా నిలవాలి



అబిడ్స్: అంధ విద్యార్థులకు గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఆశీష్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పలు రకాల సామగ్రిని పంపిణీ చేశారు. గురువారం దేవేందర్ బ్లెయిండ్ స్కూల్‌లో రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు తలసాని సాయికిరణ్ యాదవ్, ఆశీష్‌కుమార్ యాదవ్ బట్టలు, స్టేషనరీ, మిఠాయిలతో పాటు పలు రకాల సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అంధ విద్యార్థుల కోసం అందరు సేవాభావంతో వారికి అండగా నిలవాలన్నారు. మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన సందర్భంగా ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్ సమీనా బేగం

యాకుత్‌పురా: వర్షా కాలం నేపథ్యంలో ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం సూచించారు. గురువారం ఆమె సిద్దిఖీనగర్ బస్తీ దవాఖానాను సందర్శించి అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారులు, సిబ్బందితో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...వర్షా కాలంలో విజృంభించే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి వైద్యాధికారులు మందుల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

క్రియేటర్లు కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలి



అవార్డులను అందజేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్

గన్‌ఫౌండ్రీ: క్రియేటర్లు కొత్త ఆలోచనలతో ముందుకుసాగాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ఏఐజీ డెవలప్‌మెంట్ సహకారంతో కళారాజ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఆధ్వర్యంలో సామాజిక, సినీ రంగాల్లో విశిష్ట సేవలందించిన పలువురికి టీఎస్ఎఫ్ఏ–2025 అవార్డులను గురువారం కళా ప్రాంగణంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డిజిటల్ యుగంలో సృజనాత్మకతను వెలికి తీయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఏఐజీ డెవలప్‌మెంట్ చైర్మన్ మహ్మద్ ఇక్బాల్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



అఫ్జల్‌గంజ్: అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సునావత్ రవిని అశోక్‌బజార్ బిజిలి మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు ముత్యాల గోవింద్‌రాజ్, ఇతర ప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. గురువారం ఇన్‌స్పెక్టర్‌ను సత్కరించి ఆలయ కమిటీ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముత్యాల గోవింద్‌రాజ్ మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు అందించిన సహకారం అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విజయసారథి, దాసరి చంద్రశేఖర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి



కేటీఆర్‌కు మొక్కను అందజేస్తున్న ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు

అబిడ్స్: గతంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. గోషామహల్‌తో పాటు రాష్ట్ర నలుమూలలా ప్రజాభివృద్ధి, సంక్షేమం, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ల హయాంలోనే కొనసాగిందన్నారు. గురువారం కేటీఆర్‌కు మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేష్‌గౌడ్, విజయ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



బోనం కుండలతో మహిళలు



శ్రీకాంత్‌చారిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ చంటిబాబు



మహంకాళి అమ్మవారికి పూజలు



భజనలు చేస్తున్న కళాకారుల బృందం

బోనమెత్తిన కోట

ముగిసిన గోల్కొండ కోట బోనాలు
కనుల పండువగా జగదాంబిక
అమ్మవారి 9వ బోనం పూజ

భారీగా తరలివచ్చిన భక్తులు
ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు,
శివసత్తుల పూనకాలు
పోలీసుల భారీ బందోబస్తు

గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. అమ్మవారికి చివరిదైన 9వ పూజ గురువారం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనానికి ఉదయం 6 గంటల నుంచే భక్తులు కోటకు చేరుకోవడం ప్రారంభించారు. ఆలయ ఈఓ సి.వసంత పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. గోల్కొండ మెయిన్ గేటు వద్ద ఏర్పాటు చేసిన వేదికపై సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంస్కృతిక కార్యక్రమాలను భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు తెలిపారు. గోల్కొండ బోనాల చరిత్రలోనే మొదటి సారిగా అమ్మవారికి సమర్పించడానికి చేనేత పనివారు ఆలయ ప్రాంగణంలోనే మగ్గం ఏర్పాటు చేసి పట్టువస్త్రాలు తయారు చేశారని ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత తెలిపారు. పోచంపల్లికి చెందిన చేనేత కళాకారులు జయరాజు పద్మశాలి, ఏనుగుల అనిల్ కుమార్, శ్రావణి దంపతులు ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజజా రామయ్య ప్రోత్సాహంతో పట్టు చీరలు తయారు చేసినట్లు ఆమె తెలిపారు. – గోల్కొండ



కుంభ హారతిలో చైర్మన్ చంటిబాబు, మాజీ చైర్మన్లు



సంస్కృతిక ప్రదర్శనలు



అమ్మవారిని దర్శించుకున్న ఇదిడి మహంకాళి ఆలయ చైర్మన్ గడ్డి చంద్రశేఖర్



పూజల్లో శేఖర్‌రెడ్డి తదితరులు



జగదాంబిక అమ్మవారికి ఇక్కత్ పట్టుచీరను సమర్పిస్తున్న అనిల్‌కుమార్ కుటుంబసభ్యులు, ఆలయ ఈఓ వసంత



జాగరణలో ఆడుతున్న చైర్మన్, నాగన్న

శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరం



ఇన్‌స్పెక్టర్లను సన్మానిస్తున్న శంకర్‌నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

విజయనగర్‌కాలనీ: శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం అవసరమని టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్ అన్నారు. బోనాల ఉత్సవాలు శాంతియుతంగా జరిగేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన సందర్భంగా గురువారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ బి.అభిలాష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వర్లును ఆసిఫ్‌నగర్ డివిజన్ శంకర్‌నగర్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..బస్తీలు, కాలనీల్లోని ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. శీలం బాలచందర్, నందుగౌడ్, రేనేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలి



అబిడ్స్: అర్హులందరికీ రేషన్‌కార్డులు మంజూరు చేయాలని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్ డిమాండ్ చేశారు. పలు బస్తీలు, మురికివాడల్లో రేషన్‌కార్డులు లేక పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు గురువారం 4వ సర్కిల్ ఏఎస్ఓ పుష్పలతకు వినతిపత్రం అందజేశారు. అనంతరం లాల్‌సింగ్ మాట్లాడుతూ..అధికారులు అన్ని ప్రాంతాల్లో పర్యటించి రేషన్‌కార్డుల ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. పుష్పలత సానుకూలంగా స్పందించారు.

బోనాలకు సహరించిన వారందరికీ ధన్యవాదాలు



గౌలిపురా: బోనాల ఉత్సవాలు ప్రశాంతంగా ముగియడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలని గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భారత మాత ఆలయం, కోట మైసమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, ప్రధాన కార్యదర్శి అల్లి మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్ అన్నారు. బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం ఉన్నతాధికారులు, ఉమ్మడి ఆలయాల కమిటీ సభ్యులు, పోలీసులు, వివిధ శాఖల అధికారులు, గౌలిపురా కమిటీ సభ్యులకు పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు.

పోలీసుల పనితీరు అభినందనీయం



ఇన్‌స్పెక్టర్‌ను సన్మానిస్తున్న రాంసుందర్ లాల్

చాంద్రాయణగుట్ట: బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేసిన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్ వర్మను రేణుకా కాలనీ అసోసియేషన్ యూత్ అధ్యక్షుడు రాంసుందర్ లాల్ సన్మానించారు. లాల్‌దర్వాజా సింహవాహిని, ఉప్పుగూడ మహంకాళి, గౌలిపురా మాతేశ్వరీ, రాజన్నబావి ప్రాంతాల్లోని ఆలయాల వద్ద బోనాల ఉత్సవాలు, ఊరేగింపు ప్రశాంతంగా ముగియడంలో ఛత్రినాక పోలీసుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా రాత్రింబవళ్లు అంకిత భావంతో విధి నిర్వహణ చేయడం హర్షణీయమన్నారు. డీఐ పి.గోపాల్ రావును కూడా సన్మానించారు.

అంధ విద్యార్థులకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

అఫ్జల్‌గంజ్: సమాజ సేవతోనే ఎంతో తృప్తి ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. గురువారం గౌలిగూడలోని తన కార్యాలయంలో కేటీఆర్ జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అంధ విద్యార్థులకు చెక్కుల రూపంలో ఆర్థిక సహాకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..బీఆర్ఎస్‌తోనే గోషామహల్‌తో పాటు రాష్ట్ర అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శంకర్

గౌలిపురా: వ్యక్తి అదృశ్యమైన ఘటన మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..సుల్తాన్ షాహీ అశోక్ పిల్లర్ ప్రాంతానికి చెందిన జె.శంకర్ (54) చాదర్‌ఘట్‌లోని ముస్లిం మెటర్నిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రిలో ధోబీగా విధులు నిర్వహిస్తున్నాడు. శంకర్ కల్లుకు బానిసయ్యాడు. ఇటీవల కల్లు దుకాణాలను మూసి వేయడంతో మూడు, నాలుగు రోజుల్లో రాత్రి వేళల్లో నిద్రపోవడం లేదు. దీంతో శంకర్ పలుమార్లు ఇంట్లో నుంచి బయటికి వెళ్లేందుకు ప్రయత్నించగా భార్య యాదమ్మ పలుమార్లు అడ్డుకుంది. ఈ నెల 21న శంకర్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల, కల్లు కాంపౌండ్ దుకాణాల వద్ద వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం



మంత్రి వివేక్‌తో వినేష్‌బాబు, రాజువస్తాద్

గోల్కొండ: క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని మంత్రి గడ్డం వివేక్ అన్నారు. షేక్‌పేట్‌లో జరగనున్న రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు రావాల్సిందిగా కోరుతూ హైదరాబాద్ బాక్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం కలిసి ఆహ్వాన పత్రం అందించారు. వినేష్‌బాబు, ఎస్.రాజువస్తాద్, రాజు తదితరులున్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ రిమాండ్

సంతోష్‌నగర్: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ఓ వ్యక్తిని కంచన్‌బాగ్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పోలీసులు నిందితుల వివరాలను వెల్లడించారు. ముసారంబాగ్ వెస్ట్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఆరీఫ్ ఈ నెల 8న కంచన్‌బాగ్ పీఎస్ పరిధిలోని డీఎంఆర్ఎల్ ఎక్స్ రోడ్డు పోచమ్మ ఆలయం వద్ద తన బైక్‌ను పార్కు చేశాడు. కాలాపత్తర్ తాడ్‌బన్ ఖాజాపహాడ్‌కు చెందిన ఫెరోజ్ ఖాన్ అలియాస్ పితల్ (22) ఆ బైక్‌ను దొంగలించాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం విశ్వసనీయ సమాచారం మేరకు కంచన్‌బాగ్ ఎస్సై రాజు, సిబ్బంది కంచన్‌బాగ్ బీడీఎల్ రోడ్డులో ఫెరోజ్ ఖాన్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. ఫెరోజ్ ఖాన్‌పై కంచన్‌బాగ్ పీఎస్‌లో 2, సంతోష్‌నగర్ పీఎస్‌లో 1, కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అందరి సహకారంతో బోనాలు విజయవంతం



టోలిచౌకి డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు తదితరులు

గోల్కొండ: అందరి సహకారంతో గోల్కొండ కోట బోనాలు విజయవంతమయ్యాయని టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గురువారం చివరి బోనం రోజున గోల్కొండ కోటలో ఆయనను వృత్తిపని వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భారీగా వచ్చే భక్తులకు కోటలోని అన్ని ప్రాంతాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గోల్కొండ బడాబజార్, చోటాబజార్‌తో పాటు తొట్టెల ఊరేగింపులు వచ్చే మార్గాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ సైదులు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంత్‌చారి, వీర్‌సింగ్ తదితరులున్నారు.

గ్రాట్యుటీ మంజూరు పత్రాల పంపిణీ



సుల్తాన్‌బజార్: అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ నుంచి రిటైర్డ్ అయిన అర్చకులకు గ్రాట్యుటీ మొట్టమొదటి సారిగా అందించడం గొప్ప విషయమని దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ వెంకట్‌రావు అన్నారు. గురువారం బొగ్గులకుంటలోని దేవాదాయ ధర్మాదాయ కమిషనరేట్‌లో కమిషనర్ వెంకట్‌రావు చేతుల మీదుగా పదవీ విరమణ పొందిన అర్చకుడు వలివేటి వీరభద్రశర్మకు రూ.8 లక్షల పత్రాన్ని అందజేశారు. అలాగే రామలింగేశ్వర స్వామి ఆలయ స్వీపర్ పాపమ్మకు రూ.8 లక్షల గ్రాట్యుటీ, బాలకృష్ణకు రూ.3 లక్షల ఆరోగ్య భీమా, రఘుపతికి వైద్య సహాయం కింద రూ.15 వేలు, రిటైర్డ్ అయిన వారికి మంజూరు పత్రాలు అందజేశారు. తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ ఉపేంద్ర శర్మ, వెల్ఫేర్ బోర్డు సభ్యులు కృష్ణమాచార్యు మాట్లాడుతూ..అర్చక వెల్ఫేర్ ట్రస్ట్ అర్చక, ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నారాయణస్వామి, శ్రీకాంత్, అర్చక వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర అధికారి, అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావు, డీసీ కృష్ణప్రసాద్, బద్రి నారాయణచార్యులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం



గోల్కొండ: తెలంగాణలో ఎన్నికలు ఎప్పుడు జరిగిన కూడా కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ భారీ అధిక్యంతో అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ నాయకులు టి.జీవన్‌సింగ్ అన్నారు. గురువారం కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని గుడిమల్కాపూర్ గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాములు, రంగారెడ్డి, శ్రీకాంత్‌సాగర్, దశరథ్, బాబురావు, సత్యం, దీపక్ తదితరులున్నారు.

అమావాస్య పూజలు..అన్నదానాలు



అన్నదానం చేస్తున్న వంశీకృష్ణ తదితరులు



ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదానం

జియాగూడ: సంజయ్‌నగర్‌లోని నల్లపోచమ్మ, తుల్జాభవాని ఆలయంలో అమావాస్య పూజలు, మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నల్లపోచమ్మ, తుల్జాభవాని, దుర్గా దేవి, నాగదేవత ఆలయాలలో ప్రత్యేక పంచామృత అభిషేకం, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు అఖండ హారతి, చివరగా అన్నదానం జరిగింది. ఆలయ ప్రతినిధి రావుల శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ..ప్రతి నెలా అమావాస్య రోజున ప్రత్యేక పూజలు, అన్నదానం నిర్వహిస్తామన్నారు.

గౌలిపురాలో..

గౌలిపురా: అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా గౌలిపురా, అన్నపూర్ణ సేవా సంస్థ ఆధ్వర్యంలో గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖైరతాబాద్ వాసవీ సేవా కేంద్రం అధ్యక్షుడు కొల్పూరి రమేశ్ గుప్తా, కోశాధికారి ఇల్లూరి నరేంద్ర కుమార్, ఆర్యవైశ్య సంఘం లాల్ దర్వాజా గౌలిపురా అధ్యక్షులు శ్రీరాం కోటయ్య గుప్తా, ఐపీపీ శ్రీధర మల్లికార్జున్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.

కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో..



అన్నదానం చేస్తున్న ఎస్ఆర్ లక్ష్మణ్‌రావు

సుల్తాన్‌బజార్: అన్ని దానాల్లోకెల్ల అన్నదానం ఎంతో విశిష్టమైందని బజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఆర్.లక్ష్మణ్‌రావు అన్నారు. గురువారం కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. శ్రీకాంత్ హరి, సతీష్, బాలాజీ, నరేష్, లక్ష్మణ్, చోటు తదితరులు పాల్గొన్నారు.